## 96. అల్ అలఖ్

**ఆయత్‌లు : 19** **అవతరణ : మక్కాలో**

*పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

(1) ఓ ముహమ్మద్! నిన్ను పుట్టించిన నీ ప్రభువు పేరుతో పఠించు. (2) పేరుకుపోయిన రక్తపు ముద్దతో ఆయన మనిషిని పుట్టించాడు. (3) చదువు నీ ప్రభువు గొప్పగా కరుణించేవాడు.

(4) ఆయన కలము ద్వారా జ్ఞానాన్ని నేర్పాడు.

(5) మనుష్యునికి అతడు ఎరుగని విషయాలను నేర్పించాడు.

آيَاتُهَا 19 سُوْرَةُ الْعَلَقِ مَكِّيَّةٌ 96 رُكُوْعُهَا 1

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اِقْرَاْ بِاسْمِ رَبِّكَ الَّذِیْ خَلَقَ ﴿1﴾

خَلَقَ الْاِنْسَانَ مِنْ عَلَقٍ ﴿2﴾

اِقْرَاْ وَرَبُّكَ الْاَكْرَمُ ﴿3﴾

الَّذِیْ عَلَّمَ بِالْقَلَمِ ﴿4﴾

عَلَّمَ الْاِنْسَانَ مَا لَمْ يَعْلَمْ ﴿5﴾

1 – 5 వాక్యాలు

హజ్రత్ ఆయిషా (ర) తెలియజేస్తున్నారు. దైవప్రవక్త (స)కు నిజమయ్యే మంచి స్వప్నాల రూపంలో వహీ (దైవసందేశం) రావడం ప్రారంభమయింది. ఆయన కలలో చూసింది నిజమయి తీరేది. తరువాత ఆయన ఒంటరితనాన్ని ఇష్టపడసాగారు. కొన్ని రోజుల పాటు హిరా కొండగుహలో ఉండిపోయి ఆరాధనలో లీనమయ్యేవారు. ఆయన భోజన పానీయాలు ఇంటి నుండి తీసుకువెళ్ళి అక్కడ కొన్ని రోజులు గడిపి, తిరిగి హజ్రత్ ఖదీజా (రజి) దగ్గరకు వచ్చేవారు. ఆమె తిరిగి కొన్ని రోజుల కోసం భోజన సామగ్రి ఇచ్చేవారు. ఆయన (స) మరల హిరా కొండ గుహకు వెళ్ళేవారు.

ఒకరోజు ఆయన (స) హిరా కొండ గుహలో ఉండగా అకస్మాత్తుగా ఆయనపై వహీ అవతరించింది. దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ) వచ్చి ఆయనతో "ఓ ముహమ్మద్ (స)! చదవండి." ఆయన (స) బదులిచ్చారు, "నేను చదువుకున్న వాణ్ని కాదు." అప్పుడు హజ్రత్ జిబ్రయీల్ హజ్రత్ ముహమ్మద్ (స)ను తన గుండెలకేసి గట్టిగా అదుముకున్నారు. ఈ విధంగా ఆ దూత మూడుసార్లు తన గుండెలకేసి గట్టిగా అదుముకున్నారు. నాలుగోసారి అన్నారు, "ఇఖ్రా బిస్మికల్లజీ ఖలఖ్. ఖలఖల్ ఇన్సాన మిన్ అలఖ్. ఇఖ్రా వరబ్బుకల్ అక్రమ్. అల్లజీ అల్లమ బిల్ ఖలమ్. అల్లమల్ ఇన్సాన మాలమ్ యాలమ్."

హజ్రత్ ఆయిషా (రజి) సెలవిస్తున్నారు. ఈ సంఘటన తర్వాత గడగడ వణుకుతూ, కంపించిపోతూ అక్కడ నుండి మరలారు. హజ్రత్ ఖదీజా వద్దకు చేరి, "నాకు కంబళి కప్పు, నాకు కంబళి కప్పు" అన్నారు. ఆయనపై కంబళి కప్పబడింది. కొంతసేపటికి భయం తగ్గాక అన్నారు, "ఖదీజా (రజి) నాకేమయింది. నేనీ సంఘటన చూశాను. నాకు ప్రాణభయం కలుగుతోంది." ఖదీజా (రజి) ఆ సంఘటన అంతా విని చెప్పారు, "ఓ ముహమ్మద్ (స)! మిమ్మల్ని అల్లాహ్ ఎంతమాత్రం అవమానపర్చడు. మీరు బంధువుల పట్ల మంచిగా వ్యవహరిస్తున్నారు. సత్యం పలుకుతున్నారు. పేదలకు సహాయం చేస్తున్నారు. అతిథులను ఆదరిస్తున్నారు. సత్యాన్ని బలపరుస్తున్నారు. సత్యానికి తోడ్పడుతున్నారు."

| | |
|---|---|
| (6) కాని, మానవుడు పొగరెక్కి ప్రవర్తిస్తున్నాడు. (7) తనను తాను ధనికుడిగా చూసుకొని | كَلَّآ إِنَّ ٱلْإِنسَٰنَ لَيَطْغَىٰٓ ﴿6﴾ أَن رَّءَاهُ ٱسْتَغْنَىٰٓ ﴿7﴾ |

తరువాత ఖదీజా (రజి) ఆయన (స)ను వెంటబెట్టుకుని వర్ఖా బిన్ నౌఫిల్ వద్దకు వెళ్ళారు. అతడు ఆమెకు బాబాయి కుమారుడు. క్రైస్తవుడు, విద్వాంసుడు. అరబీ, హెబ్రూ భాషలలో ఇంజీల్ వ్రాసేవాడు. కదు వృద్ధులు, కంటిచూపు కోల్పోయారు. హజ్రత్ ఖదీజా (రజి) ఆయనతో, సోదరా! కాస్త మీ దౌహిత్రుని (మనుమడు) గాథ వినండి అన్నారు. హజ్రత్ వర్ఖా, హజ్రత్ ముహమ్మద్ (స)తో, “మీరు చూసిందంతా వివరించండి” అన్నారు. హజ్రత్ ముహమ్మద్ (స) తాను చూసిందంతా వివరించారు. హజ్రత్ వర్ఖా అన్నారు, “ఈ దూతయే హజ్రత్ మూసా (అ) వద్దకు వచ్చాడు. మీరు దేవుని ప్రవక్త. నేను మీ ప్రవక్త పదవీకాలంలో యువకుడిగా బలం కలవాడ్నిగా ఉండి ఉంటే బాగుండేది. మీ జాతి వారు మిమ్మల్ని దేశం నుండి వెళ్ళగొట్టేస్తారు. అప్పటి వరకూ నేను బ్రతికి ఉంటే బాగుంటుంది.” దైవప్రవక్త (స) అన్నారు, “ఏమిటి, వీళ్ళు నన్ను దేశం నుండి వెళ్ళగొడ్తారా?” వరఖా జవాబిచ్చారు, “జాతి ప్రతి ప్రవక్తతోనూ శత్రుత్వం వహించింది. ఆ కాలంలో నేను గనక ఉండి ఉంటే మీకు సంపూర్ణ సహకారం అందిస్తాను” కాని త్వరలోనే వరఖా పరమపదించారు. (సహీహ్ బుఖారీ – హ.నెం.3)

ఈ హదీసు ద్వారా తెలిసే విషయం, హజ్రత్ జిబ్రయీల్ ముందుగా దైవప్రవక్తతో అన్నది, “ఇఖ్రా” అని. ఇఖ్రా అంటే ‘చదువు’ అని మొట్టమొదటగా చదివే విషయం చెప్పారు. మొట్టమొదట అవతరించిన వహీ చదవడం వ్రాయడానికి సంబంధించినది. కాని మనం చదవడం, వ్రాయడంలో అందరికన్నా వెనుకబడి ఉన్నాం. దైవప్రవక్త (స) సెలవిచ్చారు, “అల్లాహ్ మొట్టమొదట కలాన్ని సృష్టించాడు. దానితో అన్నాడు, ‘వ్రాయి’. కలం అడిగింది. “ఏమి వ్రాయను?” అని. ప్రభువు అన్నాడు, “ఉపన్యాసం వ్రాయి. ఖియామత్ (అంతిమదినం) వరకూ జరగనున్నదంతా వ్రాయి.”

దైవప్రవక్త (స) సెలవిచ్చారు, “విద్యనార్జించడం ప్రతి ముస్లింపై విధిగా ఉన్నది. (ఇబ్నుమాజా – హ.నెం. 224)

ఫర్జ్ అంటే విధిగా చేయవలసిన పని. నమాజ్ చేయడం వలె. అంటే నమాజ్ చదవడం అవసరం. నమాజ్ చేయనివాడు తప్పు చేసినట్లే. అతడు ఫర్జ్‌ను విడిచిపెట్టాడు. అదేవిధంగా ప్రతి ముస్లింపై విద్యార్జన ఫర్జ్‌గా ఉంది. విద్యార్జన చేయని ముస్లిం నేరస్తుడు – అతడు ఫర్జ్‌ను విడిచిపెట్టాడు గనుక. ఈనాడు కోట్లాదిగా ముస్లింలు అజ్ఞానులుగా ఉన్నారు. వారికి ధార్మిక విద్యగానీ ప్రాపంచిక విద్యగానీ ఏదీ రాదు. విద్య లేకుంటే ఏ జాతీ అభివృద్ధి చెందజాలదు. విద్య లేకుండా ఏ జాతీ సాఫల్యం చెందజాలదు. జీవితం కోసం భోజనం నీరు ఎలా అవసరమో సాఫల్యం కోసం, అభివృద్ధికోసం విద్య కూడా అంతే అవసరం. జాతి పెద్దలకు, సంఘ నాయకులకు మస్జిద్ ముతవల్లీలకు, చదువుకున్న ప్రతివారూ విద్యార్జన విధి అనీ, జాతిని విద్యార్జన వైపు పురిగొల్పాలి. ఈ విషయంలో ప్రయత్నించడం అవసరం. ఈ దిశగా అందరూ ఆలోచించవలసిన విషయం ఇది. ఈ విధంగా ప్రతి వాడలో, మస్జిద్‌లో బైతుల్‌మాల్ (కోశాగారం) ఏర్పాటు చేసి విధవలు, అనాథలు, పేదలకు సహాయంతో పాటు అక్కడి పేదలకు విద్యాసౌకర్యం కలిగించాలి. వాడలోని ఏ ముస్లిం బాలుడు లేక బాలికా నిరక్షరాస్యులుగా ఉండకూడదు. దైవప్రవక్త (స) ప్రతి ముస్లింపై విద్యార్జన విధిగా చేయబడిందని సెలవిచ్చి ఉన్నారు. ధనికులకూ విద్య అవసరం. అంతేవిధంగా పేదలకూ విద్య అవసరమే, మస్జిద్‌లో ధార్మిక విద్య, పాఠశాలలో ప్రాపంచిక విద్య, ఈ విధంగా ధార్మిక, ప్రాపంచిక విద్య రెండూ అవసరమే. ప్రతి వాడలోని ముస్లింలు గనక ఈ విధంగా చేస్తే ఇన్షాఅల్లాహ్ 20 లేక 25 ఏళ్ళలో ముస్లిం జాతి బ్రహ్మాండంగా అభివృద్ధి చెందగలదు. ఉన్నతస్థానాలకు చేరుకోగలదు.

(8) నిశ్చయంగా అతడు నీ ప్రభువు వైపునకే మరలిపోవలసి ఉంది. (9) దాసుడిని అడ్డగించే వ్యక్తిని చూశావా నువ్వు.

(10) ఒక దాసుణ్ణి అతడు నమాజ్ చేయసాగినపుడు. (11) చూడండి, అతడు సన్మార్గంపై ఉంటే

(12) లేక భయభక్తుల వైఖరి పాటించమని ఆదేశిస్తే ఎందుకు వారించాలి?

(13) అతడు గనక సత్య ధర్మాన్ని ధిక్కరిస్తే దాని నుండి మొహం తిప్పుకుంటే ఏమయిందో చూడండి. (14) దైవం చూస్తున్నాడని అతనికి తెలియదా? (15) అతడు దారికి రాకపోతే మేము అతడి నుదురు పట్టుకొని ఈడుస్తాము చూడండి

(16) ఆ అబద్ధాలకోరు, దోషి నుదుటి జుత్తును (17) అతడు తన సహాయకుల సమూహాన్ని పిలుచుకోమనండి.

(18) మేము కూడ యాతన కలిగించే దూతలను పిలుచుకుంటాము.

(19) చూడండి! వాడి మాటలు వినకండి. సజ్దా చెయ్యండి మరియు దైవసాన్నిధ్యం పొందుతూ ఉండాలి.

إِنَّ إِلَىٰ رَبِّكَ الرُّجْعَىٰ ﴿8﴾

أَرَأَيْتَ الَّذِي يَنْهَىٰ ﴿9﴾

عَبْدًا إِذَا صَلَّىٰ ﴿10﴾

أَرَأَيْتَ إِن كَانَ عَلَى الْهُدَىٰ ﴿11﴾

أَوْ أَمَرَ بِالتَّقْوَىٰ ﴿12﴾

أَرَأَيْتَ إِن كَذَّبَ وَتَوَلَّىٰ ﴿13﴾

أَلَمْ يَعْلَم بِأَنَّ اللَّهَ يَرَىٰ ﴿14﴾

كَلَّا لَئِن لَّمْ يَنتَهِ لَنَسْفَعًا بِالنَّاصِيَةِ ﴿15﴾

نَاصِيَةٍ كَاذِبَةٍ خَاطِئَةٍ ﴿16﴾

فَلْيَدْعُ نَادِيَهُ ﴿17﴾

سَنَدْعُ الزَّبَانِيَةَ ﴿18﴾

كَلَّا لَا تُطِعْهُ وَاسْجُدْ وَاقْتَرِب ۩ ﴿19﴾ ع 1 19 21

6 – 19 వాక్యాలు

దైవప్రవక్త (స) కాబా గృహంలో నమాజ్ చేయనారంభించినప్పుడు ఈ రెండవ భాగం అవతరించబడింది. దైవప్రవక్త (స) మఖామె ఇబ్రాహీం వద్ద నమాజ్ చేస్తుండగా అబూ జహల్ అటుగా వచ్చాడు. “ఓ ముహమ్మద్! నిన్ను నమాజ్ చేయవద్దని చెప్పాను కదా” అంటూ ఆయనను హెచ్చరించసాగాడు. దైవప్రవక్త (స) వాడిని కఠినంగా కసిరికొట్టారు. అందుకు వాడు, “ఓ ముహమ్మద్! ఏం చూసుకొని ఎవరి సాయంతో నన్ను కసురుకొంటున్నావు? మక్కాలో నన్ను బలపరిచే వారు చాలామంది ఉన్నారు. ముస్లింలు కొద్దిమందే ఉన్నారు.” (నిసాయి, అహ్మద్, తిర్మిజి) అందుకు జవాబుగా అల్లాహ్ ఈ సూరాను అవతరింపజేశాడు. “ఓ ముహమ్మద్! జబానియా అంటే శిక్షను అమలుపరచే దూతలను పిలుచుకుంటాము అని వాడికి చెప్పు” అన్నాడు. వారు కోట్లాది మంది ఉన్నారు. జబానియా దూతలు ధర్మానికి సహాయంగా ఆకాశాన్నుండి దిగి వస్తారు. బదరు యుద్ధంలో ధర్మానికి సహాయపడేందుకు వచ్చారు. ముస్లింలు గనక ధర్మంపై ఉంటే తక్కువ సంఖ్యలో ఉన్నామని చింతించవలసిన పనిలేదు. వారికి సాయపడేందుకు జబానియా

దూతలు వస్తారు. హజ్రత్ ముహమ్మద్ (స) తన అనుచరులను సన్మార్గంపై నడిపింపజేస్తున్నారు. సన్మార్గంలోని మేలు ఏమంటే అందులో ఇహలోక సాఫల్యం, పరలోక మోక్షం ఇమిడి ఉన్నాయి.

ఈ సూరాలో అబూజహల్‌కు వార్నింగ్ ఉంది. ధర్మ వ్యతిరేకతను మానుకోవాలి.మేము వాడిని ఇహలోకంలో పరాభవం పాలు చేస్తాము. పరలోకంలో బాధాకర శిక్షను ఇస్తాము. మరల అబూజహల్‌కు వార్నింగ్ ఇవ్వబడింది. వాడు తన సహాయకులను పిలుచుకో వచ్చు. దైవప్రవక్త (స) కు సహాయంగా జబానియా దూతలు వస్తారు. ఇక పోటీ జరిగితే ధర్మపరులు విజయం సాధిస్తారు. ఎంత నమ్మకంతో, దీక్షతో అబూజహల్‌కు వార్నింగ్ ఇవ్వబడిందంటే, ఈ పని దైవం మాత్రమే చేయగలడు. అతడే ఈ పని చేయగలడు. భవిష్యత్ పరిస్థితులు ఆయనకే తెలుసు. కనుక నిస్సందేహంగా ఖుర్ఆన్ దైవగ్రంథం. ఆయన చూపిన మార్గమే సాఫల్య మార్గం.